నెయ్యి కొనుగోళ్లలో రూ.500 కోట్ల స్కాం

టీటీడీ లెక్కల ప్రకారం కిలో నెయ్యి రూ.320. అది కల్తీ నెయ్యి కావడంతో దాని వాస్తవధర రూ.120. దీంతో ఒక కిలోపై రూ.200 పక్కదారి పట్టించారు. ఆ ప్రకారం మూడేళ్లలో కేవలం నెయ్యి కొనుగోళ్లలోనే దాదాపు రూ. 500 కోట్ల కుంభకోణం జరిగింది. చిరుతను తరిమేందుకు అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కర్రలను తెప్పించడంలోనూ భారీ స్కాం జరిగింది. వీటిపై శ్రీవారి భక్తులు ఆందోళన చేపట్టాలి.



- కిరణ్ రాయల్, జనసేన తిరుపతి ఇన్‌చార్జి

సంప్రోక్షణతో శుద్ధి చేసేశాం

కల్తీ నెయ్యి దోషాన్ని ఆగస్టులో సంప్రోక్షణతో పోగొట్టి శుద్ధి చేశాం. దీనిపై భక్తులకు ఎలాంటి అపోహలు వద్దు. ఇంకా కొందరిలో ఆందోళనలు ఉండటంతో సోమవారం ఉదయం శాంతిహోమం చేస్తున్నాం. ఇప్పుడు పేరున్న సంస్థల నుంచే స్వచ్ఛమైన ఆవు నెయ్యి కొని లడ్డూ ప్రసాదాలు తయారు చేస్తున్నాం. తిరుమలలో ఇది వరకు నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందా లేదా అనే పరీక్షలు జరగలేదు. ఇక్కడ సాధారణ పరీక్షల సామర్థ్యమే ఉంది.



- శ్యామలరావు, టీటీడీ ఈవో



నెయ్యి కల్తీ అంటూ కుట్ర

మా పాలనలో టీటీడీలో ఏవేవో జరిగిపోయాయని చంద్రబాబు విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఏ ఆధారాలూ దొరక్క పోవడంతో నెయ్యి కల్తీ అంటూ కుట్ర చేస్తున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలపై కల్తీ ముద్ర వేసి అపచారానికి పాల్పడ్డారు. ఒకవేళ తిరుమల లడ్డూ కల్తీ జరిగుంటే బాధ్యులు రక్తం కక్కుకుని చావాలని శ్రీవారిని కోరుకుంటున్నా.



- భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్

పవిత్రత గురించి ఆయన మాట్లాడటమా?

నల్లరాయిని చెప్పుతో కొట్టండని గతంలో మాట్లాడిన వ్యక్తి టీటీడీ చైర్మన్ అయ్యారు. తన కుమారుడిని ఎమ్మెల్యేని చేసేందుకు పనుల పేరిట టీటీడీ నిధులు దుర్వినియోగం చేశారు. అలాంటాయన పవిత్రత గురించి మాట్లాడటమా? వారి పాలనలో అక్రమాలు జరిగుంటే నెత్తురు కక్కుకొని చస్తామని ఆయన చెప్పారు. ఆ శిక్షనూ దేవుడు త్వరలోనే వేస్తాడు. శ్రీవారి పవిత్రతను కాపాడినందుకే బాంబుదాడి నుంచి చంద్రబాబును దేవుడు రక్షించాడు.



- నరసింహయాదవ్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు

ప్రభుత్వ ఉద్యోగులూ హెల్మెట్ ధరించాల్సిందే

● కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 22: రహదారి భద్రతా దృష్ట్యా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఈ ఆదేశాలను ద్విచక్ర వాహనాలు నడిపే ఉద్యోగులందరూ విధిగా పాటించేలా సంబంధిత శాఖల అధికారులు చొరవచూపాలని ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు.



కలెక్టరేట్‌లో నేడు పీజీఆర్ఎస్

చిత్తూరు, సెప్టెంబరు 22: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు హాలులో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులంతా హాజరుకావాలన్నారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగేలా పీజీఆర్ఎస్‌లో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు.

దారి కోసం రోడ్డెక్కిన రైతులు

సీపీఐ ఆధ్వర్యంలో 'చిత్తూరు-తచ్చూరు' హైవేపై వంటావార్పు, రహదారి దిగ్బంధం

హాజరైన జాతీయ కార్యదర్శి నారాయణ



వంటావార్పు కార్యక్రమంలో నారాయణ, రైతులు, నాయకులు

నింద్ర, సెప్టెంబరు 22: తమకు సర్వీసు రోడ్డు కావాలంటూ రైతులు రోడ్డెక్కారు. ఈ మేరకు చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవేపై నింద్ర మండలం పాదిరి వద్ద ఆదివారం వంటావార్పుతోపాటు రహదారిని దిగ్బంధించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. భూములు ఇచ్చిన రైతులు సమస్య పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. హైవే కోసం స్వచ్ఛందంగా భూములిస్తే అధికారులు మాత్రం రైతుల నోట్లో మట్టి కొట్టి ఆత్మహత్యలకు పురిగొల్పుతూ వేడుక చూస్తున్నారని ధ్వజమెత్తారు. మూడేళ్ల ముందు ఈ రహదారి కోసం భూములను కారుచౌకగా కొట్టేయాలని ప్రయత్నిస్తే సీపీఐ రైతు సంఘాల ఆధ్వర్యంలో పోరాడిన ఫలితంగానే ఎకరాకు రూ.28 లక్షల వరకు ఇచ్చారని గుర్తుచేశారు. ఇపుడు రైతులతో అవగాహన మేరకు సర్వీస్ రోడ్డు వేయాలనే నిబంధనలను తుంగలో తొక్కి అడ్డగోలుగా వారి భూములు పక్కన స్తంభాలు నాటేస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు పక్కన ఎత్తయిన గోడలు నిర్మిస్తే రైతుల పంట పొలాల్లోకి ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. అలాగే చెరువునుంచి పంట భూములకు కాలువలు తీయకుండా రోడ్డు నిర్మిస్తున్నారని వాపోయారు. ఇక విచ్చాటూరు మండలంలోని కారూర్ వద్ద ఊరి పక్కన అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కట్టాల్సిన అవసరం ఉన్నా విస్మరించడం కూలీల బతుకుపై కొట్టడమేనని ఆరోపించారు. రైతాంగ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం కొనసాగిస్తామని.. రహదారి బంద్ పాటిస్తామని హెచ్చరించారు. అలాగే కారూర్ వద్ద కొండలు తవ్వి మట్టి అక్రమంగా తరలిస్తున్న సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, రైతు సంఘ నేత డాక్టర్ జనార్దన్, సీపీఐ చిత్తూరు, తిరుపతి జిల్లాల కార్యదర్శులు ఎస్.నాగరాజు, పి.మురళి, రెండు జిల్లాల సీపీఐ నాయకులు, రైతు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు. నగరి రూరల్ సీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు. నింద్ర తహసీల్దార్ శేషగిరి పర్యవేక్షించారు.

సమస్య పరిష్కరిస్తామన్న కలెక్టర్

ఇదిలా ఉండగా, నారాయణతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఫోన్లో సంభాషించారు. మంగళవారం తాను రోడ్డును పరిశీలించి.. రైతులు సమస్య పరిష్కరిస్తామని చెప్పడం ఉద్యమానికి భరోసా కల్పించినట్లయ్యిందని సీపీఐ నాయకులు తెలిపారు.

డెంగ్యూతో మరో బాలిక మృతి

● వి.కోటలో వారంలోనే రెండు మరణాలు

స్థానికులను విచారిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్



వి.కోట, సెప్టెంబరు 22: వి.కోటలో డెంగ్యూ జ్వర మరణాలు కొనసాగుతున్నాయి. నాలుగు రోజుల క్రితం మేఘన(13) మృతి చెందగా.. తాజాగా ఫాతిమా (6) అనే చిన్నారి మృత్యువాత పడింది. వి.కోట పట్టణం మసీదువీధికి చెందిన సిద్దిక్, హినాల కుమార్తె అయిన ఫాతిమాకు నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానికంగా ఆస్పత్రిలో చూపించారు. తగ్గకపోవడంతో పలమనేరుకు, అక్కడినుంచి కుప్పం పీఈఎస్‌కు తరలించారు. అక్కడ బాలికకు ప్లేట్‌లెట్స్ పూర్తిగా తగ్గిపోవడంతో వారు వేలూరు సీఎంసీకి తీసుకెళ్లాలని సూచించారు. దాంతో కుటుంబీకులు బాలికను తిరుపతికి తీసుకెళుతుండగా, మార్గమధ్యంలో మృతి చెందింది. వీధికి చివరన ఉన్న కీలపల్లె చెరువులో చెత్తాచెదారం పేరుకోవడం వల్లే దోమలు వ్యాపించి జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు తెలిపారు.

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దిగ్భ్రాంతి

వి.కోటలో డెంగ్యూ మరణాలపై పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణం ఈ మరణాలపై విచారణ జరిపి.. నివారణ చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో ఫోన్లో మాట్లాడారు. అలాగే పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని స్థానిక అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విచారణ

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ కూడా ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచనలు ఇచ్చారు. ఇంటింటా జ్వరాలపై సర్వే చేపట్టాలని ఆరోగ్యశాఖ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. స్థానికంగా రెండుచోట్ల గోమాంస విక్రయశాలలు ఉండటంతో వాటిని దూరంగా తరలించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు.



ఫాతిమా (ఫైల్ ఫొటో)

రిజిస్ట్రేషన్‌శాఖలో బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 22: స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖలో బదిలీల ప్రక్రియ ఆదివారం పూర్తయ్యింది. ఒకే స్థానంలో రెండేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న సబ్‌రిజిస్ట్రార్లు, ఇతర ఉద్యోగులకు స్థానచలనం జరిగింది. రాయలసీమ పరిధిలోని జిల్లాలను నాల్గవ జోన్‌గా పరిగణిస్తూ సబ్‌రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్లకు జోన్ స్థాయిలో స్థానచలనం కలిగింది. ఆ శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా డీఐజీ కళ్యాణి.. జోన్ నోడల్ డీఐజీగా వ్యవహరించగా, చిత్తూరు ఉమ్మడి జిల్లా డీఐజీ పి.గిరిబాబుతో కలిసి కర్నూలు డీఐజీ కార్యాలయంలో బదిలీల ప్రక్రియ నిర్వహించారు. చిత్తూరులో పనిచేస్తున్న రహంతుల్లాను పాకాలకు, ఆయన స్థానంలో కార్వేటినగరం నుంచి అశోక్‌ను బదిలీచేశారు. పాకాల ఎస్ఆర్‌గా పనిచేస్తున్న ఎం.ఎస్.లక్ష్మీనారాయణను అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ చేశారు. కార్వేటినగరం ఎస్ఆర్‌గా అన్నమయ్య జిల్లా కలికిరి నుంచి సత్యప్రసాద్‌ను నియమించారు. చిత్తూరు ఇన్‌చార్జి జాయింట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వినోద్‌ను కుప్పం సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. చిత్తూరు రూరల్ ఎస్ఆర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణను కుప్పానికి, ఆయన స్థానంలో తిరుపతి జిల్లా జాయింట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న జి.ఆనంద్‌ను బదిలీచేశారు. బంగారుపాళ్యంలో పనిచేస్తున్న సర్వేశ్వర్‌రెడ్డిని పుంగనూరుకు, ఆయన స్థానంలో పుత్తూరులో పనిచేస్తున్న యోగానంద్‌ను నియమించారు. పుంగనూరు ఎస్ఆర్‌గా ఉన్న బాలాజీని శ్రీకాళహస్తికి, పలమనేరు ఎస్ఆర్‌గా పనిచేస్తున్న పద్మశేఖర్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా చిన్నగొట్టిగల్లుకు బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో నగరి ఎస్ఆర్ టి. సుబ్రహ్మణ్యంను నియమించారు.

కామధేను వాహనంపై గణనాథుడి చిద్విలాసం



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 22: కాణిపాకం క్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా గణనాథుడు కామధేను వాహనంపై ఆదివారం విహరించాడు. ఈ కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన నాయీబ్రాహ్మణ వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామికి ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం చేసి, శోభాయమానంగా అలంకరించాక భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకు రావడంతో ఆలయ కల్యాణ వేదికపై స్వామివారి ఉత్సవర్లకు పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లను కామధేను వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. కాగా, ఆలయ ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమాల్లో ఈవో గురుప్రసాద్, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి,ఉభయదారులు పాల్గొన్నారు. ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యప్రభ వాహనసేవ నిర్వహించనున్నారు.

● నియామకాలు

డీపీవోగా నాగేశ్వర్‌నాయక్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 22: జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో)గా నాగేశ్వర్‌నాయక్ నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహించిన అరుణను కృష్ణా జిల్లా పంచాయతీ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జడ్పీ సీఈవోగా రవికుమార్‌నాయుడు



చిత్తూరు రూరల్, సెప్టెంబరు 22: అందరూ అనుకున్నట్లుగానే చిత్తూరు జిల్లా పరిషత్ (జడ్పీ) సీఈవోగా రవికుమార్ నాయుడిని నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ ప్రభుత్వంలో మూడుసార్లు ఇన్‌చార్జ్ సీఈవోగా ఈయన పనిచేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే నెల్లూరు జిల్లాకు బదిలీచేశారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా వెంకటగిరి డ్వామా ఏపీడీగా విధులు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవోగా బదిలీ చేశారు. ఇక్కడ సీఈవోగా పనిచేస్తున్న గ్లోరియాను ఆమె మాతృశాఖ అయిన రెవెన్యూకు బదిలీ చేశారు. రవికుమార్ నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే డిప్యూటీ సీఈవోగా కడప జిల్లా మైదుకూరు డీఎల్‌డీవోగా ఉన్న జుబేదాను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డ్వామా పీడీగా రవికుమార్



చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 22: జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా పీడీ)గా ఎ.రవికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హోదాలో రాయచోటి డ్వామా డీపీఎంగా పనిచేస్తున్న ఈయన్ను చిత్తూరు డ్వామా పీడీగా ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రస్తుతం డ్వామా ఇన్‌చార్జి పీడీగా ఉన్న రాజశేఖర్‌ను మాతృశాఖ అయిన రెవెన్యూ ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే.

డీఆర్‌డీఏ పీడీ తులసి బదిలీ




చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 22: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డీఆర్‌డీఏ పీడీ) డీఎంకే తులసిని మాతృశాఖకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె పీడీగా దీర్ఘకాలంగా పనిచేయడంతో బదిలీ అనివార్యమైంది. ఆ మేరకు మాతృశాఖైన కమర్షియల్ ట్యాక్స్‌కు బదిలీ అయ్యారు. ఖాళీ అయిన పోస్టుకు ఇన్‌చార్జిగా ఏ అధికారినైనా నియమించుకునే వెసులుబాటును కలెక్టర్‌కు ప్రభుత్వం అప్పగించింది.

సివిల్ సప్లయీస్ డీఎం కూడా..

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 22: పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ (సివిల్ సప్లయీస్ డీఎం) వి.మోహన్ బాబు కాకినాడకు జోనల్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న జడ్ఎంను మాతృశాఖకు బదిలీ చేస్తూ పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండియన్ ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉపాధి కూలీలకో యాప్

జన్‌మన్‌రేగా (జేపీఎన్‌ఎంపీఎన్ ఆర్‌ఈజీఏ) అందుబాటులోకి తెచ్చిన కేంద్రం



చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 22: ఉపాధి హామీ కూలీలు తమ కూలి డబ్బులు ఖాతాల్లో జమయ్యాయో లేదో తెలుసుకోవడం ప్రశ్నగా మారింది. ఇందుకోసం వారు బ్యాంకులు, తపాల, ఉపాధి హామీ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా పెరుగుతున్న సామాన్య కూలీ తన వివరాలు తెలుసుకోలేక పోవడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఉపాధి కూలీల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని వారి సమాచారాన్ని పూర్తిగా తెలుసుకునేందుకు జన్‌మన్‌రేగా (జేపీఎన్‌ఎంపీఎన్ ఆర్‌ఈజీఏ) యాప్‌ను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీనిద్వారా ఉపాధి కూలీలకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలుసుకునే వెసులుబాటు కల్పించింది.

● ఉపయోగించడం ఇలా..

మొబైల్ కలిగిన ప్రతి ఒక్కరూ గూగుల్ ప్లేస్టోర్ నుంచి జన్‌మన్‌రేగా (జేపీఎన్‌ఎంపీఎన్ ఆర్‌ఈజీఏ) యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో వర్కర్ అటెండెన్స్, పేమెంట్స్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే బ్లాగ్ తెరుచుకుంటుంది. రాష్ట్ర, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ ఉపాధి జాబ్‌కార్డు సంఖ్య నమోదు చేసే వివరాలు కనిపిస్తాయి. కూలీ పేరుపై క్లిక్ చేయగానే పనిచేసిన రోజులు, ప్రాంతం, కూలి మొత్తం, ఏ బ్యాంకు ఖాతాకు డబ్బు జమైందో కనిపిస్తోంది. ఒక వేళ నగదు జమకాకపోతే కారణాలు ఉంటాయి. ఉపాధి పథకంలో చేపట్టే పనుల సమాచారం, స్థానికంగా జరిగే అక్రమాలపై ఫిర్యాదుకు ఇందులో వీలు కల్పించారు. అన్ని భాషల్లో వివరాలు ఉంటాయి. కాగా, జిల్లావ్యాప్తంగా 2.54 లక్షల ఫ్యామిలీ జాబ్ కార్డులు ఉండగా, 4.43 లక్షల మంది ఉపాధి కూలీలు ఉన్నారు. కాగా రోజువారీ ఉపాధి పనులకు 32వేల మంది హాజరవుతున్నారు. ఇదిలా ఉండగా యాప్ వినియోగంపై డ్వామా అధికారులు కూలీలకు అవగాహన కల్పించాల్సి ఉంది.

1,800 గ్రాముల గంజాయి స్వాధీనం : ఒకరి అరెస్టు



నిందితుడితో పోలీసులు

నగరి, సెప్టెంబరు 22: నగరి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఉదయం 11 గంటలకు కీళపట్టు సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద గంజాయి తీసుకెళుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. ముందస్తు సమాచారంతో తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లి ఆర్ఐ జయకృష్ణ, వీఆర్వో కేశవులు సమక్షంలో తమిళనాడులోని అంబత్తూర్‌కు చెందిన శేఖర్(54)ని అరెస్టు చేశారు. 1,800 గ్రాముల గంజాయితోపాటు స్కూటీ, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

తీపి రైతులకు చేదు అనుభవాలు

- మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్న వైనం

నగరి, సెప్టెంబరు 22: చెరకు పంటను పండించి పది మందికి తీపిని పంచిపెట్టే రైతు చేదు అనుభవాలను చవి చూడాల్సి వస్తోంది. చెరకు పంట ఏడాది కాలం కష్టపడి సాగుచేసినా మిగిలేది స్వేదమే అంటున్నారు రైతులు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదేళ్లక్రితం నాలుగు చక్కెర పరిశ్రమలుండేవి. నింద్ర మండలంలో నేటమ్స్, బుచ్చినాయుడుకండ్రిగలో మయూర, పుంగనూరులో వాణి, ఎస్‌ఆర్‌పురంలో సాగర్ చక్కెర పరిశ్రములుండేవి. నేడు కేవలం సాగర్ చక్కెర పరిశ్రమ ఒక్కటే ఉండటంతో రైతులు ఎక్కువగా దళారులపై ఆధారపడుతున్నారు. తమిళనాడులోని సెంజి, బన్నారి, నెల్లికుప్పం వద్ద ఈఐడీ ప్యారీ పరిశ్రమలు నడుస్తున్నాయి. అక్కడి పరిశ్రమలు టన్ను చెరకుకు రూ.3,600-3,700 వరకు చెల్లిస్తున్నాయి. మన జిల్లాలోని ఎస్‌ఆర్‌పురం మండలంలోని సాగర్ చక్కెర పరిశ్రమ మాత్రం 2021-22లో రూ.2850, గత ఏడాది రూ.3000 రవాణా చార్జీలతో కలిపి ప్రారంభంలో చెల్లించారు. సంక్రాంతి తర్వాత టన్నుకు రూ.100 పెంచారు. సాగు కోసం రైతుల ఖర్చులు పెరుగుతున్నా.. మద్దతు ధర ఆశించిన స్థాయిలో లేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

ఖర్చులిలా..

టన్ను చెరకు కటింగ్ చేయాలంటే గతంలో రూ.400 నుంచి రూ.500 ఉండేది. ఇపుడు ప్రారంభంలోనే రూ.600-700 చెల్లించాల్సి వస్తోంది. అలాగే కూలీలకు రెండేళ్ల కిందట మహిళలకు మధ్యాహ్నం వరకు రూ.120 ఉండగా, నేడు రూ.200 చెల్లిస్తున్నారు. మగవారికి రూ.300 ఉంటే ఇపుడు రూ.400 చెల్లిస్తున్నారు. నాగలికి రూ.600 ఉండగా రూ.800, బోదె తోలడానికి రూ.800 ఉంగా రూ.1100 చెల్లిస్తున్నారు. ఎరువులు, పనిముట్ల ధరలు సైతం గతంలో కంటే అధికంగా పెరిగాయి. ఇలా అన్నీ పెరుగుతున్నా చెరకు మద్దతు ధర పెంచడంలో పరిశ్రమలు ముందుకు రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

మద్దతు ధర గతంలో ఇలా నిర్ణయించేవారు

సహజంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభంలో చెరకు మద్దతు ధర ప్రకటించగా.. రాష్ట్రప్రభుత్వం కొంతమేర పెంచితే పరిశ్రమవారు మరికొంత పారితోషికంగా చెల్లించి మద్దతు ధర నిర్ణయించేవారు. జిల్లాలో ఒకే పరిశ్రమ ఉండటమే గాక పంట విస్తీర్ణం మోతాదుకు మించడంతో పరిశ్రమ వారు నిర్ణయించిన ధరకే చెరకును తరలించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



క్రషింగ్‌కు సిద్ధంగా ఉన్న చెరకు తోట

స్థానికంగా పరిశ్రమలు లేకపోవడం వల్లే..



స్థానికంగా పరిశ్రమలు ఉంటే చెరకును తరలించడానికి ఇబ్బందులుండేవి కావు. రవాణా చార్జీలు తగ్గడమే గాక, కూలీలను పరిశ్రమవారు సరఫరా చేయడం జరుగుతుంది. దీంతో రైతులకు ఆశించిన లాభాలు వస్తాయి.

- విశ్వనాథరెడ్డి, టీవీ కండ్రిగ

ఏజెంట్లపై ఆధారపడాల్సి వస్తోంది



కౌలుకు భూమి తీసుకుని పంట సాగు చేస్తున్నాను. స్థానికంగా ఫ్యాక్టరీ లేక ఏజెంట్లపై ఆధారపడాల్సి వస్తోంది. అదే డైరెక్టుగా ఫ్యాక్టరీకి పంట తరలించుకోగలిగితే ఆశించిన లాభాలు వస్తాయి.

- నవీన్, రైతు, విజయపురం

అయ్యో.. దేవుడా..!

- పుణ్యక్షేత్రాలను దర్శించుకుని వస్తుండగా ప్రమాదం
- ఆగి ఉన్న లారీని కారు ఢీకొని ముగ్గురి మృతి
- ఏడుగురికి గాయాలు
- మృతులు, క్షతగాత్రులు నెల్లూరువాసులే



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

చిల్లకూరు, సెప్టెంబరు 22: ఇద్దరు స్నేహితులతో కలిసి ఆ కుటుంబం పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరుగు ప్రయాణమైంది. మరో అరగంటలో గమ్యం చేరనున్న క్రమంలో తిరుపతి జిల్లా గూడూరు సమీపంలోని చిల్లకూరు వద్ద అదుపు తప్పిన వీరి కారు ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో నెల్లూరుకు చెందిన ముగ్గురు మృతిచెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. నెల్లూరురూరల్ మండలం కాకుపల్లి గ్రామానికి చెందిన గోసెల బాబు(50), అతడి భార్య లక్ష్మమ్మ చిన్నపాటి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి కిషోర్‌బాబు, కళ్యాణి, మాధవి పిల్లలు. వీరిలో కళ్యాణి నెల్లూరులోని వనంతోపులో ఉండగా, ఆమెకు వెన్నెల మేఘన(8), జశ్వంత్ పిల్లలు. ఈ కుటుంబ సభ్యులు, తమ సమీప బంధువు రాధాకుమారి, నెల్లూరుకే చెందిన బాబు కుటుంబ స్నేహితులైన సునీల్ కుమార్, జగదీశ్వర్(45) కలిసి ఈనెల 18న పుణ్యక్షేత్రాల సందర్శనకు సునీల్ కుమార్ కారులో వెళ్లారు. కాణిపాకం, కంచి, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఆదివారం వేకువన చిల్లకూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా వచ్చే సమయానికి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న కంటైనరు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తాత, మనవరాలైన బాబు, వెన్నెల మేఘన, జగదీశ్వర్ మృతిచెందారు. లక్ష్మమ్మ, మాధవి, కళ్యాణి, కిషోర్‌బాబు, రాధాకుమారి, సునీల్‌కుమార్, జశ్వంత్‌లకు గాయాలయ్యాయి. వీరికి గూడూరు ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందాఇంచి.. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. సంఘటనా స్థలాన్ని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ రమణకుమార్ పరిశీలించారు. ఈ మేరకు ఎస్‌ఐ సురేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన బాబు- జగదీశ్వర్ - వెన్నెలమేఘన



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ రమణకుమార్

వరసిద్ధుడి అన్నదానానికి రెండు టన్నుల కూరగాయల వితరణ



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 22: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హోసూరుకు చెందిన శ్రీకాంత్ రెండు టన్నుల కూరగాయలను విరాళంగా ఆదివారం అందించారు. దాతను ఆలయ అధికారులు ఆహ్వానించి.. స్వామి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన సూపరింటెండెంట్ బాలరంగస్వామి, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

26న పీఎంఈజీపీ అవగాహన కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 22: ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం (పీఎంఈజీపీ)కు సంబంధించి ఈనెల 26న కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 18 ఏళ్లు నిండి ప్రాజెక్టు విలువ గరిష్ఠంగా రూ.50లక్షల వరకు పెట్టదలచినవారు, రూ.10లక్షలు ప్రాజెక్టు విలువ దాటిన అభ్యర్థులు 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్‌కార్డు, మొబైల్ నెంబరు, పుట్టిన తేదీ, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు, కులధ్రువీకరణ పత్రం, విద్యార్హత పత్రం, పాన్‌కార్డు, రేషన్ కార్డు, కరెంట్ బిల్, హౌస్ ట్యాక్స్, పంచాయతీ పర్మిషన్, బ్యాంకు పాస్‌పుస్తకం మొదటి పేజీ, ఇన్సూరెన్స్ కాపీలను అందజేయాలి. మాంసానికి సంబంధించిన యూనిట్లు, ప్రాసెసింగ్, కేనింగ్, మత్తుపానీయాలు, పొగాకు ఉత్పత్తులు, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ తయారీ యూనిట్లు ఈ పథకం కింద అనర్హతగా ప్రకటించారు. వివరాలకు చిత్తూరు కొంగారెడ్డిపల్లెలోని జిల్లా గ్రామీణ పరిశ్రమల మండలి ఆఫీస్‌లో అధికారిని లేదా 94408 14613, 98496 12989 నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జ్‌గా రాంభూపాల్‌రెడ్డి నియామకం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 22: కాంగ్రెస్ చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్‌గా తిరుపతికి చెందిన రాంభూపాల్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఉత్తర్వులు జారీచేశారు. ఈయన గతంలో ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

తిరుమల ప్రసాదాల్లో కల్తీ మహాపాతకం

- సచ్చిదానంద సరస్వతి



సచ్చిదానంద సరస్వతికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

పుంగనూరు, సెప్టెంబర్ 22: తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డు తయారీలో కల్తీ జరగడం మహాపాతకమని శృంగేరి సమీపంలోని హరిహరపురం శ్రీపీఠం పీఠాధిపతి స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి తెలిపారు. ఆదివారం పుంగనూరు కోనేరు వద్ద శ్రీరామానంద తీర్థ సరస్వతి ఆరాధన మహోత్సవాల్లో పాల్గొనడానికి విచ్చేసిన ఆయనకు బ్రాహ్మణసంఘం, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పుంగమ్మచెరువు కట్టపై వెలసిన వినాయకుడు, కాశీవిశ్వేరస్వామి, కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలయ్యాక మీడియాతో మాట్లాడారు. శ్రీవారి ప్రసాదాల్లో కొందరు పరమ దుష్టులు, అత్యాశపరులు కల్తీకి పాల్పడడం బాధాకరమైన విషయమన్నారు. ఈ విషయంలో నెయ్యి కంపెనీ, టీటీడీ, ప్రభుత్వ నిర్లక్ష్యం ఏది జరిగినా తప్పేనని స్పష్టం చేశారు. వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను హైందవులందరూ తీవ్రంగా ఖండించాలని తెలిపారు. ఇలాంటి తప్పిదాలు భవిష్యత్తులో జరగకుండా జాగ్రత్త పడాలన్నారు.

మా బిడ్డ మృతికి కారకుడైన ప్రైవేటు వైద్యుడిని అరెస్టు చేయాలి

- ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల నిరసన



ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న బాధిత కుటుంబీకులు

పుంగనూరు, రూరల్, సెప్టెంబరు 22: వైద్యం వికటించి పది నెలల బాలుడు సాత్విక్ నందన్ మృతికి కారకుడైన ప్రైవేటు డాక్టర్ కార్తీక్‌ను అరెస్టు చేయాలని మృతుడి కుటుంబీకులు డిమాండ్ చేశారు. ఆదివారం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బాలుడి మృతదేహానికి వైద్యులు శవపరీక్ష నిర్వహించారు. అనంతరం మృతదేహంతో కుటుంబీకులు నేరుగా కార్తీక్ చిన్నపిల్లల ఆస్పత్రి వద్దకొచ్చారు. 'మా బిడ్డను చంపేసిన డాక్టర్‌ను అరెస్టు చేయండి. మాకు న్యాయం చేయాలి' అంటూ నినాదాలు చేశారు. ఆస్పత్రి మూసేసి ఉండడంతో నేరుగా పోలీస్‌స్టేషన్ వద్దకెళ్లి డాక్టర్‌పై కేసు నమోదు చేసి.. అరెస్టు చేసి న్యాయం చేయాలని మృతుడి తల్లి వెన్నెల కోరారు. సీఐ శ్రీనివాసులు బాధితులతో మాట్లాడుతూ.. వైద్యుడిపై కేసు నమోదు చేశామని, శవపరీక్ష నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పి పంపారు.

నేడు మంత్రి రామానాయుడి పర్యటన

గంగవరం, సెప్టెంబరు 22: మండలంలోని పెద్దవెలగటూరు-అప్పినపల్లె, పసపత్తూరు గ్రామాల వద్ద గతంలో ఏర్పాటు చేసి అర్ధంతరంగా ఆగిన హంద్రీ-నీవా లిఫ్ట్ ఇరిగేషన్ పనులను సందర్శించడానికి నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం రానున్నారు. ఈ మేరకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఇద్దరు తహసీల్దార్ల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 22: జోన్-4 పరిధిలో 17 మంది తహసీల్దార్లను పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా బదిలీచేస్తూ సీసీఎల్‌ఏ శ్రీఖేష్ బి.లత్కర్ ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన డి.లోకేశ్వరరావును కర్నూలు జిల్లాకు బదిలీ చేయగా, సత్యసాయి జిల్లా నుంచి ఎస్కే హమీద్ బాషాను మన జిల్లాకు కేటాయించారు.

కమర్షియల్ ట్యాక్స్‌లో పలువురి అధికారుల బదిలీ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 22: ఉమ్మడి జిల్లా కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కమిషనర్ భానుప్రకాష్‌ను విజయవాడ రీజనల్ కార్యాలయానికి బదిలీ చేయగా.. ఆయన స్థానంలో విజయవాడ హెడ్‌ఆఫీసు నుంచి విజయభాస్కర్ రానున్నారు. పలమనేరు సహాయ కమిషనర్ రవికుమార్‌రెడ్డిని ప్రొద్దుటూరు-2కు బదిలీ చేయగా ఆ స్థానంలో మదనపల్లె నుంచి శ్రీనివాసరావును నియమించారు. వీరితోపాటు ఆరుగురు డీసీటీవోలు, 12 మంది ఏసీటీవోలు, 12 మంది ఏఈవోలు, 16 మంది ఈటీఏలు బదిలీ అయ్యారు. వీరందరూ త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

విద్యుత్ శాఖలోనూ...

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 22: విద్యుత్‌శాఖలో పలువురిని బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. లైన్ ఇన్స్‌పెక్టర్లు 5మంది, లైన్‌మెన్లు 27, అసిస్టెంట్ లైన్‌మెన్లు 10మందిని బదిలీచేశారు. ఇంకా పలువురు అధికారులను ఈ రాత్రి బదిలీచేస్తూ ఉత్తర్వులురావచ్చని అధికారులు తెలిపారు.

నిరుద్యోగ భృతికి 25వరకు దరఖాస్తుల స్వీకరణ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 22: జిల్లా వ్యాప్తంగా వేద, ఆగమాలు చదివిన బ్రాహ్మణ యువత నుంచి నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తులు ఆహ్వానించిన సంగతి తెలిసిందే. నిరుద్యోగ బ్రాహ్మణ యువత కోరిక మేరకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 25వతేదీ వరకు పొడిగించినట్లు జిల్లా దేవదాయశాఖ ఏసీ ప్రసన్నలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, సుధాకర్ గురుకుల్ సూచించారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

- రూ.4లక్షల బంగారం, వెండి, రూ.5వేల అపహరణ

చిత్తూరు, సెప్టెంబరు 22: పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. పైగా ఆ ఇంటి ముందున్న పెంట్‌హౌస్‌లో అందరూ ఉండగా బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లిపోయారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నగరంలోని పోలీసు ఐపీఎస్ గజాణన కాలనీలో ఇర్ఫాన్ కుటుంబం నివాసం ఉంటోంది. ఈయన ఎస్బీఐలో ఉద్యోగి. ఈయనకు ఒకే కాంపౌండ్‌లో ముందుభాగంలో పెంట్‌హౌస్, వెనుకభాగంలో ఇల్లు ఉంది. ఆదివారం కావడంతో అందరూ పెంట్‌హౌస్‌లో ఉన్నారు. ఉదయం 11.30 గంటల సమయంలో ఇంటికి తాళం తెరిచి ఉండటంతో బీరువాలోని రూ.4లక్షల బంగారం, వెండితోపాటు రూ.5వేలను ఎత్తుకెళ్లిపోయారు. చంటి బిడ్డతో ఉన్న ఓ మహిళ ఇంట్లోకి వెళ్లిందని ఎదురింటికి చెందిన మహిళ ఇర్ఫాన్‌కు చెప్పింది. దీంతో ఆయన తన కుటుంబీకులతో కలిసి ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువాలోని బ్యాగులో పెట్టిన బంగారం, వెండి, నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని అర్థమవడంతో ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.15 లక్షల టపాకాయలు స్వాధీనం



చిత్తూరు, సెప్టెంబరు 22: చిత్తూరు నగరంలో వన్ టౌన్ పోలీసులు భారీగా టపాకాయలను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బీజెడ్ హైస్కూల్ వెనుకభాగంలోని ఓ పురాతన ఇంట్లో రూ.15 లక్షల టపాకాయలను నిల్వ ఉంచిన విషయాన్ని గుర్తించి ఆదివారం సీజ్ చేశారు. సీఐ జయరామయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



రాహుకేతు పూజల్లో భర్తతో నమిత

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హీరోయిన్ నమిత కుటుంబ సమేతంగా ముక్కంటి ఆలయానికి వచ్చేసారు. అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని సహస్ర లింగం వద్ద ఆమె రాహుకేతు సర్పదోష నివారణ పూజలను చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా ఉత్తరప్రదేశ్ సీఎంవో ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్ సింగ్ కుటుంబ సమేతంగా ముక్కంటిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కుక్కల దాడిలో పొట్టేళ్ల మృతి



వరదయ్యపాళె, సెప్టెంబరు 22: మండలంలోని సీఎల్‌ఎన్ పల్లిలో కుక్కల దాడిలో 15 పొట్టేళ్లు మృతి చెందడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గ్రామానికి చెందిన ఎస్టీకాలనీలోని వి.రామకృష్ణయ్య, లక్ష్మయ్య, వేమయ్య పొట్టేళ్లు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం కాలనీ సమీపంలోని అరికసేను వద్ద క్వారీలో పొట్టేళ్లు మేత మేస్తుండగా హఠాత్తుగా కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 15 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఏడు గాయపడ్డాయి.

3న పవన్‌కల్యాణ్ తిరుపతి రాక?

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనార్థం అక్టోబర్ 3న తిరుపతి రానున్నట్లు పార్టీ జిల్లా యంత్రాంగానికి ప్రాథమిక సమాచారం అందింది. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా తిరుపతికి రానున్న ఆయనకు ఘనంగా స్వాగతం పలకడానికి నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు మొదలుపెట్టారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



జస్టిస్ కృష్ణకుమార్, జస్టిస్ దండపాణి

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తమిళనాడు హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ డీ కృష్ణకుమార్, న్యాయమూర్తి జస్టిస్ దండపాణి, ఎమ్మెల్యే కూన రవికుమార్, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.



కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్

హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు

తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. టీటీడీ ఈ వివరాలను ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 82,406 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,151 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి లడ్డు కల్తీ బాధాకరం



ప్లకార్డు చూపుతున్న సినీ నటుడు బాలాజీ తదితరులు

తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 22: 'తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తాం. కళ్లకద్దుకుని తీసుకుంటాం. అలాంటి లడ్డూ అపవిత్రమైందని తెలిసి ఎంతో బాధ కలిగింది. లడ్డూ కల్తీ వ్యవహారం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉంది. దీనికి కారకులైన వారిని శిక్షించాలి' అని సినీ నటుడు బాలాజీ కోరారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే దేనినీ సహించబోమన్నారు. ఈ మేరకు ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన టీడీపీ నేత జగన్నాథం తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

వాహనం ఢీకొని కాలినడక భక్తురాలి మృతి



సరళ మృతదేహం వద్ద విషణ్ణ వదనాలతో భక్తులు

పాకాల, సెప్టెంబరు 22: తిరుమల దర్శనానికి కాలినడకన వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ఘటనలో తమిళనాడుకు చెందిన భక్తురాలు సరళ(43) మృతిచెందారు. పాకాల మండలం శంఖంపల్లె ఆంజనేయస్వామి ఆలయం సమీపాన ఆదివారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం మండలం నుంచి భక్తుల బృందం కాలినడకన తిరుమలకు బయలుదేరింది. శనివారం రాత్రి ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో వీరు సేదదీరారు. తెల్లవారుజామున తిరిగి కాలినడక ప్రారంభించారు. వీరిలో తాటిమానుపల్లెకు చెందిన సరళను గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. తీవ్రగాయాలైన ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. ఈమె భర్త జయపాల్‌తో కలిసి 23 ఏళ్లుగా కాలినడకన తిరుమలకు వెళ్లి దర్శనం చేసుకునేవారు. కళ్లముందే భార్య దుర్మరణం చెందడంతో జయపాల్ కన్నీరుమున్నీరయ్యారు. సీఐ మద్దయ్య ఆచారి, ఎస్ఐ మహేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పరిశీలన గృహంలో బాలుడి మృతి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: తిరుపతి శివార్లలోని మంగళం పరిధిలోని ప్రభుత్వ పరిశీలన గృహంలో ఆదివారం అనారోగ్యంతో బాలుడు మృతి చెందాడు. తిరుచానూరు ఎస్ఐ జగన్నాథరెడ్డి కథనం మేరకు.. తమిళనాడు గుడియాత్తంకు చెందిన బాలుడు మార్చినెలలో ఇంటి నుంచి పారిపోయి, భాకరాపేట వద్ద ఇటుక బట్టీలో కూలి పనులు చేసుకుంటున్నాడు. అక్కడున్న ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, మంగళం పరిధిలోని ప్రభుత్వ పరిశీలన గృహానికి తరలించారు. రెండు రోజుల క్రితం ఆ బాలుడు అనారోగ్యానికి గురవడంతో మంగళంలోని ప్రాథమిక వైద్య కేంద్రంలో చికిత్స చేయించారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో శనివారం మధ్యాహ్నం రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ సమాచారాన్ని పోలీసులు బాలుడి తల్లిదండ్రులకు తెలియజేశారు.

శ్రీవారిమెట్టు మార్గంలో విజయానందతీర్థ స్వామి



చంద్రగిరి, సెప్టెంబరు 22: తిరుమల శ్రీవారి దర్శనార్థం మైసూరు దత్త పీఠాధిపతి విజయానందతీర్థ స్వామి శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమలకు కాలినడకన వెళ్లారు. ఆదివారం ఉదయం శ్రీవారిమెట్టు వద్ద కల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కాలినడకన తిరుమలకు వెళ్లారు. పలువురు స్వామిజీలు, అధికారులు ఆయన వెంట ఉన్నారు.

సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



పెంగరగుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

గంగవరం, సెప్టెంబరు 22 : గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సంక్షోభంలో నెట్టేస్తే, నేడు కూటమి ప్రభుత్వం సంక్షేమం దిశగా అడుగులేస్తోందని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బైరెడ్డిపల్లె మండలంలోని తీర్థం పంచాయతీ, పలమనేరు మండలంలోని పెంగరగుంట గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. బైరెడ్డిపల్లె మండలంలోని మొదలిపొద రేవులు, కైగల, పసలమంద మెట్టలలో ఎమ్మెల్యే పర్యటించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పసలమందలో బోరుమోటరుకు, తీర్థం గ్రామంలో డ్రైనేజి పనులకు పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిననాటి నుంచి చంద్రబాబు అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో పాటు, గత ప్రభుత్వంలో అర్థాంతరంగా ఆగిపోయిన పేదల గృహాలకు ప్రభుత్వం తరపున నిదులు మాంజూరు చేయడానికి కూడా చర్యలు చేపట్టారన్నారు. పలమనేరు మండలం పెంగరగుంటలో మాట్లాడుతూ మునలమడుగు వద్ద రూ.18కోట్లతో ఏనుగుల టూరిజం హబ్, నియోజకవర్గంలో రూ.200 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో బైరెడ్డిపల్లె, పలమనేరు మండలాల టీడీపీ అధ్యక్షుడు కిషోర్‌గౌడు, నాగరాజ రెడ్డి, సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్.వి.బాలాజి, సుబ్రమణ్యం శెట్టి, గణేష్, రామచంద్రనాయుడు, వెంకటమునిరెడ్డి, సెల్వరాజ్ రామూర్తినాయుడు, హరామగిరి, రామచంద్ర, అమరనాథరెడ్డి, పెద్దబ్బ, స్వతంత్రబాబు, హరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



శాంతిపురం, సెప్టెంబర్ 22 : మండల పరిధిలోని ప్రీతిచామనూరు వద్ద రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పిఎస్ మునిరత్నంలు ఆదివారం భూమి పూజ చేశారు. కర్లగట్ట-తంబిగానిపల్లె గ్రామాల మధ్య కృషి విజ్ఞాన కేంద్ర ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు 53.5 ఎకరాల భూమిని కేటాయించింది. కృషి విజ్ఞాన కేంద్రం వెళ్లాలంటే కర్లగట్టు వెళ్లి తరువాత చాలా దూరం చుట్టుకుని వెళ్లాల్సివుంది. అలాకాకుండా కుప్పం-పలమనేరు జాతీయ రహదారి నుంచి దగ్గర దారి కావాలని అధికారులు అడగగా, తంబిగానిపల్లె సమీపంలోని గట్టు గ్రామం నుంచి వెళ్లొచ్చని టీడీపీ నేతలు తెలిపారు. అక్కడ నుంచి రోడ్డు వేయాలంటే కొంతమంది రైతులు పట్టా భూములు ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. తరువాత టీడీపీ నేతలు రైతులతో మాట్లాడి ఒప్పించారు. ఆదివారం రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. త్వరలోనే కేంద్ర బృందం పర్యటిస్తుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. తరువాత కృషి విజ్ఞాన కేంద్ర నిర్మాణ పనులు వేగవంతం అవుతాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి పివి నాగరాజు, యూనిట్ ఇన్‌చార్జిలు మణి, రుద్రప్ప, జయారెడ్డి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు గిరిధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, డాక్టర్ వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం : చల్లా



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, సెప్టెంబర్22:మన రాష్ట్రం సంక్షోభంలో ఉన్నా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యా లయ ఆవరణలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాగానే పింఛన్ రూ.3000 నుంచి రూ.4000 పెంచడం, అన్నక్యాంటీన్ ద్వారా రూ..5 లకే కడుపునిండా అన్నం అందిస్తున్నారన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి స్థానిక హైస్కూల్ వరకు ర్యాలీగా వెళ్లి ప్రజలకు ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్య క్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, నాయకులు పతిరాజు, ప్రదీప్‌రాజు, పురుషోత్తమ రాజు, ప్రత్యేక అధికారి రవీంద్ర, ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణవేణి, ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, ఏపీఎం నరోత్తమరెడ్డి, ఏపీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వి.కోట : వి.కోట మండలం కృష్ణాపురం, బోడిగుట్టపల్లె, బైరుపల్లె పంచాయతీలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్ తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నేతలతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో చేసిన ప్రగతిపై ప్రజలతో మమేకం అయ్యేందుకు జరుపుతున్న కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సోమల, సెప్టెంబరు 22: సోమల హైస్కూల్‌లో 1981-82 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహిం చారు. 42 ఏళ్ల అనంతరం కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. నాటి గురువులు రంగారెడ్డి, రాయప్పరెడ్డి, ఖాసింసాహెబ్, రామసుబ్బశర్మ, మల్లికార్జున, అఫ్రోజాబేగం ను సన్మానించి జ్ఞాపికలు అందజేసి పాదాభివందనాలు చేశారు. ఉమాశంకర్, షకీల్, రమాపతి, వాసువాంబ, మనోహరి, భాస్కర్‌రావ్, జనార్ధన్, శ్రీదేవి, విజయకుమారి, రాంమోహన్, జీసీకే ప్రసాద్, హెచ్‌ఎం హరినాద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

కుప్పం, సెప్టెంబరు 22: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కుప్పంలో సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కుప్పం ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ఆదివారం విరాళాల సేకరణ చేపట్టారు. కుప్పం పట్టణవాసులు, వ్యాపారులు బియ్యం, ఉప్పు, పప్పు, బట్టలు వంటి నిత్యావసరాలను విద్యార్థులకు ఇచ్చారు. ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు మాట్లాడుత సేకరించిన వస్తువులను కిట్లుగా తయారుచేసి అక్టోబరు మొదటి వారంలో విజయవాడలోని వరద పీడిత ప్రాంతాలకు వెళ్లి బాధిత ప్రజలకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్, అధ్యాపకులు షహీన్‌తాజ్, ఏడుకొండలు, కుమార్, ఎస్వీ.పునీత్, అంజన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గాండ్ల కులస్తుల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రమ



గంగవరం, సెప్టెంబరు 22 : జీఎల్ఎస్ ఫారం పాఠశాలకు చెందిన గణితశాస్త్ర ఉపాధ్యాయురాలు రమను గాండ్లకుల సంఘ జిల్లా నాయకులు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసి పురస్కారం అందించారు. ఆదివారం చిత్తూరులోని జై-హింద్ పాఠశాలలో అఖిల భారత గాండ్ల తెలికుల ఉద్యోగ ఉపాధ్యాయ సంఘ సమావేశం నిర్వహించారు. 2024కు సంబంధించి ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తున్న గాండ్ల కులస్తుల సేవలను గుర్తించి ఉత్తమ పురస్కారాలను ప్రదానం చేశారు. జీఎల్ఎస్ ఫారం పాఠశాలకు చెందిన రమకు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, రెడ్డిరమేష్, జిల్లా అధ్యక్షుడు ఏ.ఆర్.కుమార్‌లు పురస్కారం అందించి పూలమాలలు వేసి సత్కరించారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

మునీశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠాపన



కల్లూరు, సెప్టెంబర్ 22: పులిచెర్ల మండలం కావేటి గారిపల్లి పంచాయతీ కూనపల్లిలో నూతనంగా నిర్మించిన మునీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం గంగస్వీకరణ, హోమం, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితుల మంతోచ్ఛరణల నడుమ మునీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుక నిర్వహించారు. కూనపల్లి నుంచి సూదులేటి కుటుంబీకులు పొంగళ్లు తీసుకొచ్చి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, సెప్టెంబర్ 22: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

నెల్లిమంద పాలేటమ్మ ఆలయ పునరుద్ధరణకు నిర్ణయం

సోమల, సెప్టెంబరు 22: మండలంలోని పాలేటమ్మ ఆలయ పునరుద్ధరణ చర్యలకు శ్రీకారం చుట్టారు. వందల ఏళ్ల నాటి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పలు గ్రామాల ప్రజలు ఆదివారం ఆలయం వద్దకు చేరుకొని ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొన్ని సంవత్సరాలుగా రెండు వర్గాల వారు అమ్మవారి జాతరను వేర్వేరు గా నిర్వహిస్తున్నారు. ఆలయ పునరుద్ధరణకు సమిష్టిగా చర్యలు తీసుకోనేలా తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్, మాజీ సర్పంచు హరిప్రసాద్, మంజునాథ్, సతీశ్, జగన్, చంద్రశేఖర్, నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు



రామకుప్పం, సెప్టెంబరు 22: రామకుప్పంలోని వరసిద్ధి వినాయకాలయంలో శనివారం రాత్రి సంకటహర చతుర్థి పూజలు ఘనంగా జరిగాయి. పూజారి నాగరాజశర్మ స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. ఆలయ ఆవరణలోని సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామిలకు కూడా విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

మాజీ ఎమ్మెల్సీ గౌనివారికి సన్మానం



శాంతిపురం, సెప్టెంబర్ 22 : మండల పరిధిలోని వెంకటేపల్లెలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులును అబకలదొడ్డి పంచాయతీ టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. ఆదివారం అబకలదొడ్డి పంచాయతీ టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా గౌనివారి శ్రీనివాసులును కలిశారు. పంచాయతీ సచివాలయం వద్ద ఈనెల 26వ తేదీ జరిగే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వెంకటేష్, మురళి, నారాయణ, రాధాకృష్ణ, బాబు, బద్రి, ఎదురుగుట్టపల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు లయన్స్ క్లబ్ కిట్లు



కుప్పం, సెప్టెంబరు 22: కుప్పం లయన్స్ క్లబ్ అందించిన నిత్యావసర సరుకుల కిట్లను విజయవాడ వరద బాధితులకు ఆదివారం అక్కడి లయన్స్ క్లబ్ ప్రతినిధులు అందించారు. కిట్ల తయారీకోసం బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజు, వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, సీఈవో సాగర్ రాజ్‌లు రూ.లక్ష వితరణ చేశారు.

గుండెపోటుతో ఏవో మృతి



రమణ (ఫైల్)

గంగవరం, సెప్టెంబరు 22 : రామసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పనిచేసే రమణ ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. బైరెడ్డిపల్లెలో కాపురం ఉంటున్న రమణ గతంలో బైరెడ్డిపల్లె ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేశాడు. ఆదివారం ఉదయం ఇంట్లో ఉండగా గుండెపోటు వచ్చి మృతిచెం దాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బైరెడ్డిపల్లెలోని వారి స్వగృహం చేరుకొని, రమణ మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బైరెడ్డిపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు కిషోర్‌గౌడ్, కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

గంగవరం, సెప్టెంబరు 22 : పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆర్.బి.సి.కుట్టి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి హాజరవుతారని తెలిపారు.

శ్రీవారి ప్రసాదాల కల్తీలో నిందితులను కఠినంగా శిక్షించాలి

కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ చేపట్టాలి ● పుంగనూరులో జగన్ దిష్టిబొమ్మ దహనం





మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కూటమి నేతలు, శ్రీవారి ప్రసాదాల కల్తీపై నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ, బీజేపి నేతలు

పుంగనూరు, సెప్టెంబర్ 22: తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదాల తయారీలో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు పదార్థాలతో మలినం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసినవారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం పుంగనూరు కొత్తయిండ్లు నుంచి మాజీ సీఎం జగన్, టీటీడీ మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి చిత్ర పటాలతో కూడిన దిష్టిబొమ్మలను ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఊరేగించారు. టీటీడీని అపవిత్రం చేసిన నేతలు, అధికారులను శిక్షించాలని, స్వామివారి ప్రసాదాలను కల్తీ చేసిన కారకులను అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బగిడి గోపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో టీటీడీని జగన్ భ్రష్టు పట్టించారని ఆరోపించారు. అర్హతలేని వ్యక్తి ధర్మారెడ్డికి ఈవో పోస్టు కట్టబెట్టి నాశనం చేశారన్నారు. సీబీఐతో విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ శ్రీవారి ప్రసాదాల్లో జరిగిన కల్తీల గురించి మాజీ సీఎం జగన్, టీటీడీ పాలకులు, అధికారులకు తెలిసి ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం జగన్, కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదవరెడ్డి, నాయకులు సుబ్రమణ్యంరాజు, బీజేపీ నాయకులు మల్లికారాణి, నానబాల కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటినుంచి 'పొలం పిలుస్తోంది'

కుప్పం, సెప్టెంబరు 22: ఈనెల 24న కుప్పం మండలంలోని చందం, నాలుకుంట గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఏవో అమృతవల్లి తెలిపారు. 25వ తేదీన ఉదయం కొత్తపల్లి, మధ్యాహ్నం గరిగ చీనేపల్లె గ్రామాలలో నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు, ప్రజాప్రతినిదులు హాజరవుతారని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చౌడేపల్లె : ఈనెల 24 నుంచి పొలం బడి కార్యక్రమం ఉంటుందని ఏవో జ్యోతి పేర్కొన్నారు. 24న గడ్డంవారి పల్లె, పరికిదోన, 25న ఆమిని గుంట, చారాల, అక్టోబర్1న ఏకొత్తకోట, దుర్గసముద్రం, 3న కొండామారి, చౌడేపల్లె,8న కాటిపేరి, కాగతి, 9న దిగువ పల్లె, వెంగళపల్లె, 15న లద్దిగం, 29ఏచింతమాకులపల్లె, 16న పుదిపట్ల, కొండయ్యగారిపల్లె, 22న శెట్టిపేట, పెద్దయల్లకుంట్ల, 23 పంది ళ్లపల్లె, చౌడేపల్లె, 29 గడ్డంవారిపల్లె, పరికిదోన, 30ఆమినిగుంట, చారాల, నవంబర్ 11న ఏకొత్తకోట, దుర్గసముద్రం, కొండామారి, చౌడేపల్లె, కాటిపేరి, కాగతి, 13న దిగువపల్లె, వెంగళపల్లె, 19న లద్దిగం, 29ఏ చింతమాకులపల్లె, 20న పుదిపట్ల, కొండయ్యగారిపల్లె, 26న శెట్టిపెట, పెద్దయల్లకుంట్ల, 27న పందిళ్లపల్లె, చౌడేపల్లె, డిసెంబర్3న గడ్డంవారిపల్లె, పరికిదోన. 4న ఆమినిగుంట, చారాల, 10న ఏకొత్తకోట, దుర్గసముద్రం, 11న కొండామారి, చౌడేపల్లె, 17న కాటిపేరి, కాగతి, 18న దిగువపల్లె, వెంగళపల్లె, 24న లద్దిగం, చింతమాకులపల్లె, 26న పుదిపట్ల, కొండయ్యగారిపల్లె గ్రామాల్లో పొలంబడి ఉంటుందన్నారు.

వేరుశనగ రైతును వణికిస్తున్న వర్షాభావం

వర్షం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు ● ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చూడాలని రైతుల వేడుకోలు



ఎండిపోతున్న వేరుశనగ మొక్కలు

రామకుప్పం, సెప్టెంబరు 22: కుప్పం ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు వేరుశనగ రైతులను వణికిస్తున్నాయి. నియోజకవర్గంలో సన్న, చిన్నకారు రైతులు తమకున్న కొద్దిపాటి భూముల్లో ఏటా వర్షాధార పంటగా వేరుశనగ సాగు చేస్తారు. దశాబ్దన్నర కాలంగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో వేరుశనగ రైతులు తరచూ నష్టాలను చవిచూస్తున్నారు. పంట దిగుబడి వచ్చే సమయంలో వర్షాలు మొఖం చాటేయడం, అధిక వర్షాల వల్ల పంట దెబ్బతినడం పరిపాటిగా మారింది. మరోవైపు అటవీ సమీప పొలాల్లో పంటలపై అడవి పందులు దాడులు చేస్తూ పిందె దశలోనే కాయలను తినేసి నష్టం కల్గిస్తుంటాయి. దీంతో పలువురు రైతులు ఏదోవిధంగా పొలాల్లో బోరు బావులు తవ్వుకుని ఉద్యానపంటలపై దృష్టి సారించి, వేరుశనగ సాగుకు స్వస్తి చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో సాగువిస్తీర్ణం సైతం తగ్గిపోతోంది. రామకుప్పం మండలంలో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 1577 హెక్టార్లు. ఏటేటా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఈ సారి ఖరీఫ్ సీజన్‌లో కేవలం 732 హెక్టార్లలో మాత్రమే రైతులు వేరుశనగ సాగు చేశారు. విత్తనాలు విత్తిన కొత్తలో వర్షాలు కురవడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. నెల రోజులుగా వర్షాలు కురవక పోవడంతో పంటచేతికి వస్తుందో లేదోనన్న బెంగ వారిలో నెలకొంది. మరో పది రోజుల్లో వర్షాలు కురవకపోతే కాయలు నేలలోనే మగ్గిపోతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు పొలాలకు నీరు వదిలి కాయలు కోస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ సారి ఖరీఫ్‌లో వేరుశనగ రైతులకు నష్టాలే ఎదురవుతున్నాయి. దీంతో వారు పంటల బీమాపై ఆశలు పెట్టుకుంటున్నారు. కొన్ని దశాబ్దాలుగా వేరుశనగ సాగు చేయని పలుకుబడి కల్గిన వ్యక్తులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందుతోంది. బీమా చేయించినా సాధారణ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందని ద్రాక్షగానే మిగులుతోంది. ఈసారైనా అధికారులు క్షేత్రా స్థాయిలో పరిశీలనలు జరిపి, పంటనష్టపోయిన ప్రతి రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సబ్సిడీ విత్తన వేరుశనగ వ్యాపారుల పాలు

ఏటా ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పెద్ద ఎత్తున ప్రైవేటు వ్యాపారుల పాలవుతున్నాయి. రైతుల నుంచి వ్యాపారులు వేరుశనగ విత్తనకాయలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. వేరుశనగ విత్తన కొనుగోలు ప్రక్రియలో వ్యాపారుల మధ్య విబేధాలు తీవ్రతరమై, పెద్దమనుషులు పంచాయతీలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈసారి ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వ్యవసాయ శాఖ మండలంలో 1110హెక్టార్లలో సాగుకు సరిపడ వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేసింది. కానీ సాగు విస్తీర్ణం మాత్రం 732హెక్టార్లకే పరిమితమైంది.

వర్షాలు పడక ఎండుతున్న వేరుశనగ

రొంపిచెర్ల, సెప్టెంబరు 22: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ పంటలు వర్షాలు కురవక ఎండుతున్నాయి. మండలంలో 185 హైక్టార్లలో రైతులు వేరుశనగ సాగు చేశారు. గానుగచింత, పెద్దమల్లెల పంచాయతీలో పంట బుడగలు దిగి కాయలు ముదిరే సమయంలో వర్షాలు కురవకపోవడంతో వాడుముఖం పట్టాయి. దీనికి తోడు ఈ పంచాయతీల పొలాలు అటవీ ప్రాంత సమీపంలో ఉన్నందున అడవి పందుల బెడద కూడ ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాధారం కింద సాగుచేసిన అలసంద, జొన్న, మొక్కజొన్న, పెసలు, ఉలవలు, జనుము, జీలుగ కూడ ఎండుదశలో ఉన్నాయి. వేరుశనగ పంటకు 2 శాతం యూరియా ద్రావణం పిచి కారీ చేయడంతో కొంతవరకు బెట్ట నుంచి రక్షంచుకోవచ్చని ఏవో సుధారాణి అన్నారు.



గానుగచింతలో ఎండుతున్న వేరుశనగ పంట

సూరయ్యగారిపల్లెలో ఘనంగా వలస దేవర్లు





తట్టాబుట్టలతో గ్రామం విడిచిపోతున్న ప్రజలు, పొలాల వద్ద వంటవార్పులు

సోమల, సెప్టెంబరు22: సోమల మండలం సూరయ్యగారిపల్లెలో గ్రామస్తులు ఆదివారం గ్రామం విడచి వలస బాట పడ్డారు. ఉదయం 6గంటలకే గ్రామస్తులు నడివీధి గంగమ్మ ఆలయం వద్దకు తట్టాబుట్టలతో చేరుకుని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఇంటిళ్లి పాది ఇళ్లకు తాళాలు వేసి పశువులను తోలుకుని గ్రామం విడిసి పొలాల బాట పడ్డారు. పొలాల వద్ద పందిళ్లు వేసుకుని అమ్మవార్లను ప్రతిష్ఠించారు. అక్కడే వంటావార్పులు చేసుకుని అమ్మవార్లకు పొంగళ్లు వండి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి ఉల్లాసంగా ఆటపాటలతో గడిపారు. గ్రామంలోకి ఇతర వ్యక్తులు ప్రవేశించకుండా తలారులు కాపు కాసారు. సాయంత్రం గ్రామంలోకి చేరుకున్న ప్రజలు గృహాలను శుద్ధిచేసి నడివీధి గంగమ్మ ఆలయం వద్దకు పొంగళ్లతో చేరుకుని పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా పడి పంటలు పండాలని అమ్మవారిని ప్రార్థించారు. జంతు బలిదానం చేసి బలిహరణాన్ని పొలాల్లో చల్లారు. పూజా కార్యక్రమాల్లో విశ్రాంత హెచ్‌ఎం. పోకల రామచంద్ర, వాటర్‌షెడ్ చైర్మన్ డిసెంబర్‌రావు, రాజా, మనోహర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రబలిన జ్వరాలు





మసీదు వీధిలో ఫాగింగ్, బాలిక మృతదేహానికి నివాళులర్పిస్తున్న రామచంద్ర నాయుడు

వి.కోట, సెప్టెంబరు 22: మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో ప్రజలకు జ్వరాలు జోరందుకున్నాయి. వారం వ్యవధిలోనే వి.కోట పట్టణ పరిధిలో ఇద్దరు డెంగ్యూతో మృతి చెందడం పరిస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది. నెలరోజులుగా ప్రజలు జ్వరాలతో వణికిపోతున్నారు. వారాల తరబడి బాధితులు తీవ్ర జ్వరంతో ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఇందుకు పారిశుధ్య లోపమే ముఖ్యకారణంగా తెలుస్తోంది. తాగునీటి ట్యాంకులను సక్రమంగా శుభ్రం చేయక పోవడం, చెత్తాచెదారాలను తొలగించకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది జ్వరాలు అదుపు కావడం లేదు.

గంగమ్మ ఏరు, కీలపల్లె చెరువులతోనే ముప్పు

వి.కోట పట్టణానికి ఓ వైపు గంగమ్మ ఏరు, మరో వైపు కీలపల్లె చెరువుల్లోకి పట్టణానికి చెందిన మురుగునీరు వెళుతోంది. వర్షాలు వస్తే వ్యర్థాలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి ఇబ్బంది లేకుండా ఉండేది. అయితే ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో నీటి ప్రవాహం లేక గంగమ్మ ఏరు, కీలపల్లె చెరువులో మురుగుకుంటల వల్ల దోమలు అధికంగా వ్యాప్తి చెందుతున్నాయి. పంచాయతీ సిబ్బంది వి.కోట పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నా అవి తాత్కాలిక ఉపశమనాలను ఇస్తున్నాయే తప్పా శాశ్వత పరిష్కారం దొరకట్లేదు. మూడు రోజులుగా గంగమ్మ ఏరులో మురుగును తొలగిస్తున్నారు. కీలపల్లె చెరువులోను జనావాసాలకు దగ్గర్లోని ప్రాంతంలో దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఫాతీమా మృతి పట్ల సంతాపం

వి.కోట మసీదు వీధికి చెందిన సిద్ధిక్ కుమార్తె ఫాతీమా (6) డెంగ్యూ జ్వరంతో మృతి చెందడం పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్, సుబ్బన్న, ధీరజ్ తదితరులు వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు ఘటనా స్థలానికి చేరుకుని బాలిక మృతదేహాన్ని పరిశీలించారు. వైసీపీ నేతలు సైతం బాలిక కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పంచాయతీ సిబ్బంది వాడల్లో ఫాగింగ్ పనులు చేపట్టారు. మసీదు వీధితో పాటు మిగిలిన వాడల్లోను పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వరదబాధితులకు రూ.లక్ష ఆర్థికసాయం



చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 22: విజయవాడ వరదబాధితులకు తమ వంతు సాయంగా రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందిస్తున్నట్లు శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల యాజమాన్యం భాస్కర్ నాయుడు, మహేంద్ర కుమార్‌లు తెలిపారు. విద్యార్థుల నుంచే కాకుండా కళాశాల నుంచి కూడా కొంత మొత్తాన్ని వరద బాధితులకోసం సేకరించిన రూ.లక్ష మొత్తాన్ని ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు చెక్కు రూపంలో అందించారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అరుల్‌నాథన్ తదితరులు

పాలసముద్రం, సెప్టెంబరు 22: రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తోందని గంగాధరనెల్లూరు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి అరుల్‌నాథన్ అన్నారు. ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆముదాల, పాలసముద్రం, ఎస్ ఆర్ ఆర్ కండ్రిగ పంచాయితీల్లో ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శేఖర్‌రాజు, బాబునాయుడు, జే.విజయ్‌కుమార్, రవినాయుడు, రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు-బలిజకండ్రిగ రోడ్డు గుంతలమయం



కావేరిరాజుపురం వద్ద గుంతలమయమైన చిత్తూరు -బలిజకండ్రిగ రోడ్డు

పాలసముద్రం, సెప్టెంబరు 22: చిత్తూరు బలిజకండ్రిగ రోడ్డు గుంతలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. చిత్తూరు నుంచి ఎల్ యన్ పురం వరకు 13 కి.మీ సింగిల్ రోడ్డుగా ఉంది. రెండేళ్లుగా ఆర్ అండ్ బీ అధికారులు ఈ మార్గంలో గుంతలు సైతం పూడ్చలేదు. కొద్దిపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి గాయాల పాలవుతున్నారు. అధికారులు ఈ మార్గంలో రోడ్డును బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టీడీపీ నాయకుడికి గాలి భానుప్రకాష్ నివాళి



విజయపురం, సెప్టెంబరు 22: మండలంలోని కళియంబాకం మిట్ట కండ్రిగ గ్రామంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు హరినాథ్‌కు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నివాళులర్పించారు. ఆదివారం హరినాథ్ కర్మక్రియల్లో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిది చినబాబు, పలువురు నాయకులు అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబుయాదవ్, గుణభూషణమ్మ, గుణశేఖర్‌రెడ్డి, రోశినాయుడు, నాగభూషణంయాదవ్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 22: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని పెరుమాళ్లకండ్రిగ పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ప్రజా రంజక పాలనతో ప్రజల మన్ననలను పొందిందన్నారు. ఏడు పదుల వయసులోనూ ఒక యువకుడిలా రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ జిల్లా నేతలు చంద్రప్రకాష్, జయచంద్రనాయుడు, మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

చురుగ్గా పాళ్యంకొండ అభివృద్ధి పనులు



విగ్రహ ప్రతిష్ఠకు స్థలాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

గుడిపాల, సెప్టెంబరు 22: మండలంలోని ఆంజనేయస్వామి పాళ్యం కొండపై ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం కొండపైన ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుర్రప్పనాయుడు, కార్యదర్శి తారకరామ్, కమిటీ సభ్యులు కోటేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

27న పుత్తూరులో జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 22: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్, సీడాప్, డీఆర్డీఏల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27న పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కల్గిన మహిళలు, పురుష అభ్యర్థులు హాజరుకావచ్చని తెలిపారు. పలు ప్రముఖ కంపెనీలు పాల్గొనే ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 6300954441 లేదా 7993502145 నెంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

నేడు 'జీవితసత్యాలు' గ్రంథావిష్కరణ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 22: స్థానిక తపోవనం ఉన్నత పాఠశాలలో హరివిల్లు లలిత కళా వేదిక ఆధ్వర్యంలో, రచయిత్రి శ్యామలాదేవి రచించిన జీవిత సత్యాలు గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ కోశాధికారి గోవిందన్ తెలిపారు. పార్థసారధి నాయుడు పాఠశాలకు మైక్ సెట్ బహుకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హరినాయుడు, మునస్వామి, భాస్కర్‌రెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమాలకు నగరంలోని కళాకారులు, సాహితీవేత్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి జరిమానా

చిత్తూరు, సెప్టెంబరు 22: మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి కోర్టు ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున రూ. 1.60 లక్షల జరిమానాను విధించింది. ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ట్రాఫిక్ పోలీసులు గట్టి నిఘా ఉంచి నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందిపై కేసు నమోదు చేసి జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ. 10వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ నిత్యబాబు మాట్లాడుతూ ఈ తొమ్మిది నెలల కాలంలో 322 మంది మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసి రూ. 27లక్షలు జరిమానా విధించినట్లు వివరించారు.

నేడు సాంబయ్యకండిగలో 'ఇది మంచి ప్రభుత్వం'

చిత్తూరు, సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సాధించిన పాలన ప్రగతిని గుర్తుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం సాంబయ్యకండిగలో నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు.

ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం



శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 22: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీడీనెల్లూరు నియోజకవర్గ ఎస్సీసెల్ కార్యదర్శి ఎన్.కుమార్, మండల స్థాయి అధికారులు మద్దికుప్పం పంచాయతీలో ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోదండరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లేపల్లెలో అ'పూర్వ' కలయిక



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 22: మండలంలోని నెల్లేపల్లె గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయం ఆదివారం పూర్వ విద్యార్థులు అపూర్వ కలయికకు వేదికైంది. గంగాదరనెల్లూరు మండలం నెల్లేపల్లెలో 1999-2000లో 10వతరగతి చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. పాతజ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా పలువురు టీచర్లు మాట్లాడుతూ వృత్తిపరంగా ఎక్కడ ఉన్నా పేద విద్యార్థులకు సాయం అందించాలని ఆకాంక్షించారు. అనంతరం అప్పటి టీచర్లుగా పనిచేసిన వారికి పూర్వవిద్యార్థులు పాదాభివందనాలు చేశారు. తర్వాత శాలువలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీబాలాజి విద్యానికేతన్ స్కూల్ మాజీ కరస్పాండెంట్ బండి పట్టాభిరెడ్డి, టీచర్లు గిరిబాబు, వినోద్‌కుమార్, గోపాల్‌రెడ్డి, జానకిరామరెడ్డి, పురుషోత్తం, సుబ్రమణ్యం, దాము, యుగంధర్ పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలలో ప్రక్షాళన జరగాలి : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథనాయుడు

పెనుమూరు, సెప్టెంబరు 22: తిరుమలలో పూర్తిస్థాయి ప్రక్షాళన జరగాలని, లడ్డూ కల్తీ వ్యవహారంలో పాత్రధారులను ఉరితీయాలని టీఎన్‌టీయూసీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి లోకనాథనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పెనుమూరులో పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీడీబీ రిపోర్టు ప్రకారం లడ్డూలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిందని, చేప, పంది, ఆవు కొవ్వుల నుంచి తీసిన నూనె ఉందని తేలిందని అన్నారు. జగన్ బ్యాచ్ శ్రీవారిని అడ్డుపెట్టుకుని వ్యాపారాలు చేయడమే కాకుండా తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను అపహాస్యం చేసేందుకు కుట్రపన్నారని మండిపడ్డారు. స్వామివారి నైవేద్యాలకు వాడే నాణ్యమైన నెయ్యి రూ.1600 చొప్పున కొంటూ లడ్డూ కోసం కిలో రూ.320కే నెయ్యి కొనుగోలు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, జిల్లా కార్యదర్శి తలారి రెడ్డెప్ప, ప్రధానకార్యదర్శి భాస్కర్, నాయకులు శ్రీనివాసచౌదరి, హేమాద్రి నాయుడు, గుర్రప్పనాయుడు, దుర్గాప్రసాద్, మురళీ నాయుడు, హరి, శియ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాటూరులో జగన్ దిష్టిబొమ్మ దగ్ధం



ఐరాల, సెప్టెంబరు 22: తిరుమల లడ్డూ తయారీలో నెయ్యి కల్తీ ఘటనకు సంబంధించి మాజీ సీఎం జగన్‌ను అరెస్టు చేయాలని పొలకల ఉపసర్పంచ్ బత్తల సురేంద్రనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం పాటూరు సంతగేటులో టీడీపీ యువతతో కలిసి జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలను వైసీపీ దెబ్బతీసిందన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఉపాధ్యక్షుడు ధనంజయనాయుడు, మాజీ ఎంపీటీసీ దేవాజీనాయుడు, తనోజ్ పాల్గొన్నారు.

లోకేశ్ పర్యటన విజయవంతం
మొక్కులు తీర్చుకున్న నేతలు



తిరుమలలో ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 22: మంత్రి నారా లోకేశ్ బంగారుపాళ్యం పర్యటన విజయవంతం కావడంతో ఆదివారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బంగారుపాళ్యం క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్‌పీ ధరణీ ప్రసాద్ నాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్వర చౌదరి తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ నారా లోకేశ్ యువగళంలో ఇచ్చిన మొదటి హామీ మేరకు బంగారుపాళ్యంలో డయాలిసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో తిరుమలేశుడిని దర్శించుకున్నట్లు తెలిపారు.

గుండ్లకట్టమంచిలో విద్యుత్ సమస్య పరిష్కారం

- ట్రాన్స్‌కో ఏడీ హరి



మరమ్మతులు చేపడుతున్న ట్రాన్స్‌కో సిబ్బంది

బంగారుపాళ్యం, సెప్టెంబరు 22: గుండ్లకట్టమంచి దళితవాడలో ఏర్పడిన విద్యుత్ సమస్యను పరిష్కరించినట్లు ట్రాన్స్‌కో ఏడీ హరి, డీఈ కొండయ్య తెలిపారు. శనివారం రాత్రి గ్రామంలో ఏ వస్తువు ముట్టుకున్నా షాక్ కొట్టడంతో దళితులు జాతీయ రహదారిలో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రాత్రికి రాత్రే మరమ్మతు పనులు చేపట్టారు. ఆదివారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రెండురోజుల క్రితం విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన తాత, మనవడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఉన్నతాధికారులతో చర్చించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

6న ముస్లింల ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 22: అక్టోబరు 6వ తేదీన చిత్తూరులో ముస్లింల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ చెప్పారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తున్నారని అన్నారు. అందులో భాగంగా 6వ తేదీన ఉదయం 9.30 గంటలకు చిత్తూరులో ఫైర్‌స్టేషన్ సమీపంలోని ఉర్దూ షాదీమహల్‌లో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ముస్లింలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వివరాలకోసం 9705535100, 9959192746 నెంబర్లను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్, కార్యదర్శి సయ్యద్ నూర్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు షౌకత్, ఉపాధ్యక్షుడు రషీద్, కార్యదర్శి ఇనాయతుల్లా, నియోజకవర్గ అధ్యక్షుడు ముస్తఫా, ఉపాధ్యక్షుడు సర్దార్ పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ ప్రజలకు సంక్షేమం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నింద్ర, సెప్టెంబర్ 22: రాష్ట్రంలో ఉన్న సంక్షోభ పరిస్థితులను అధిగమించి కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందిస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. ఆదివారం నింద్ర మండలంలోని ఎలకాటూరు పంచాయితీలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ ఇచ్చిందని, పింఛన్లు పెంచిందని గుర్తుచేశారు. నింద్ర, విజయపురం లలో పారిశ్రామిక పార్కు కోసం కృషి చేస్తున్నానని తెలిపారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చక్రపాణి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, ఎంపీడీవో అరుణ, సీనియర్ నాయకులు వెంకటేశులు నాయుడు, తంగరాజ్, దశరథవాసు, రవినాయుడు, భాస్కర్ రెడ్డి, రవికుమార్, మోహన్‌రెడ్డి, కుప్పారెడ్డి, బాబుయాదవ్, ప్రకాష్, గిరి, దేవా, అయ్యప్ప, వెంకట నరసింహులు, వజ్రం, వేదాచలం, నాగూర్, వెంకటరమణ, ఓంప్రకాష్, తేజేష్, మురళీనాయుడు ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



వెదురుకుప్పం, సెప్టెంబరు 22: కార్వేటినగరం మండలం ముక్కరవానిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జరిగిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బెంగళూరు నగరంలోని వైట్‌ఫీల్డ్‌లో ఉన్న వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వారు ఎన్టీఆర్ వైద్య సేవలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 169 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 108 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు ఆ ఆస్పత్రి కో-ఆర్డినేటరు లోకేశ్వర్ తెలిపారు. ఉచితంగా మందులు అందించామని చెప్పారు. వైదేహి ఆస్పత్రి డాక్టర్లు అనూజ, నిషాంత్, మొనీష్, జహ్నవీ, లిఖిత్, లలిత, ప్రవీణ్‌రాజ్, దర్శన్, సందేష్, నాగబాల, ప్రధాన కార్య నిర్వాహకులు సురేష్‌రాయల్, మహేష్, నరేష్, ప్రసాద్, బాలాజీ, తిరుమలయ్య, వెంకటేష్, చందు పాల్గొన్నారు.

ఇంకెంత కాలం నిర్మిస్తారు..!?



అర్ధాంతరంగా ఆగిపోయిన ఆలత్తూరు గ్రామసచివాలయ భవన నిర్మాణం

వెదురుకుప్పం, సెప్టెంబరు 22: కార్వేటినగరం మండలంలోని ఆలత్తూరు సచివాలయ భవన నిర్మాణం ఇంకెంత కాలం సాగుతుందని జనం చర్చించు కుంటున్నారు. వైసీపీ పాలన పూర్తిగా భవన నిర్మాణం చేయడానికి సమయం చాలలేదు. అప్పట్లో రూ.45 లక్షలు మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు ఇప్పటికీ పూర్తి చేయలేదు. గ్రామ సచివాలయ ఉద్యోగులకు, ప్రజలకు పాట్లు తప్పడం లేదు. అదే సమయంలో ఆ మొండిగోడల భవనం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతోంది.

ఆ దారిలో వెళ్లాలంటే నరకమే..!



బిల్లుదొన గ్రామానికి వెళ్లే మార్గం

వెదురుకుప్పం, సెప్టెంబరు 22: ఆ దారిలో వెళ్లాలంటే నరకమే. గుంతలు పడిన రోడ్డు. వానొస్తే నీళ్లు నిలిచిపోయి గుంతలలోతు తెలియక ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. ఇది కార్వేటినగరం మండలం గురవరాజుగుంట నుంచి బిల్లుదొన గ్రామానికి వెళ్లే రోడ్డు పరిస్థితి. అధికారులు, పాలకులు ఈ రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రారంభానికి నోచని బీఎస్ఎన్ఎల్ టవర్



వెదురుకుప్పం, సెప్టెంబరు 22: కార్వేటినగరం మండలం పట్టేవారిఇండ్లు వద్ద బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. బీఎస్ఎన్ఎల్ సేవలను అందుబాటులో తేవాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలు తీసుకొస్తున్న ఈవో గురుప్రసాద్, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఉభయదారులు







శివపార్వతుల వేషధారణలో నృత్యం చేస్తున్న కళాకారులు, కుండపై నృత్యం చేస్తున్న కళాకారిణి, మహిశాసురమర్ధిని అవతారం

కాణిపాకంలో సాంస్కృతిక శోభ

కాణిపాకంలో వరసిద్ది వినాయక స్వామి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ఆస్థాన మండపంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాకారిణుల నృత్యాలు, మాయాబజారు నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. - ఐరాల(కాణిపాకం)



మాయాబజార్ నాటికలో ఓ సన్నివేశం